భక్తిశ్రద్ధలతో బక్రీద్



గుంతకల్లు టౌన్: ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



గుత్తి ఈద్గాలో ప్రార్థన చేస్తున్న గుంతకల్లు ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి

సాక్షి నెట్‌వర్క్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో గురువారం బక్రీద్ (ఈదుల్‌- జుహా) పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. నూతన దుస్తులు ధరించి ఈద్గాలకు వెళ్ళి ప్రత్యేక నమాజులు చేశారు. ఈ సందర్భంగా ఈద్గాలలో మత గురువులు ప్రత్యేక బయాన్‌లు చేసి త్యాగానికి, దైవత్వానికి బక్రీద్ పండుగ ప్రతీక అని ఉపన్యసించారు. ఈద్గాల లో ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. నమాజుల అనంతరం ముస్లింలు గొర్రెలను బలి(ఖుర్బానీ) ఇచ్చి నిరుపేదలు, బంధువులకు మాంసం పంచిపెట్టారు. గుత్తి ఈద్గా మైదానంలో గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.



గుంతకల్లు టౌన్: ఈద్గా మైదానంలో ప్రార్థనలు జరిపిస్తున్న ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్ పీర్ సాహెబ్



వైఎస్సార్‌సీపీ నేత ఫయాజ్‌బాషాకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు



గుత్తి రూరల్: కొత్తపేట ఈద్గాలో బయాన్ చేస్తున్న ఇమాం



పుట్లూరు మండలం సూరేపల్లిలో అల్లా సందేశాన్ని వినిపిస్తున్న మతపెద్ద



బీకేఎస్‌లో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



పామిడిలో ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా తొలి ఏకాదశి



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి



యల్లనూరులో పూజలందుకుంటున్న వేంకటేశ్వరుడు



గుంతకల్లుటౌన్: స్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



గరుడ వాహనంపై రుక్మిణీ పాండురంగస్వామి



అనంతగజగరుడలక్ష్మీనారాయణస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

పామిడి: స్థానిక తగ్గు దేవాలయంలోని అనంత గజ గరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో గురువారం తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత నారాయణస్వామి దేవతామూర్తులను విగ్రహాలను శోభాయానంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి ప్రాకారోత్సవం జరిపారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

యల్లనూరు: ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్లూరు, యల్లనూరు, నిట్టూరు, చింతకాయమంద, తిమ్మంపల్లి, గొడ్డుమర్రి తదితర గ్రామాల్లో వెలసిన వెంకటరమణుడు, పెద్దమ్మ, తిమ్మమ్మ, గంగమ్మ, భైరవేశ్వరుడు, హనుమాన్ తదితర ఆలయాల్లో పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వార్లకు పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఇంటింటా రంగుల ముగ్గులు, పిండి వంటలు చేసుకుని సంతోషంగా గడిపారు.

గుంతకల్లుటౌన్: రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలలో సుగంధ ద్రవ్యాలు కలిపిన జలంతో శ్రీవారి పాదాలకు అభిషేకం చేపట్టారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, కార్యదర్శి నారాయణస్వామి, సభ్యులు వెంకట్, రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై రుక్మిణీ పాండురంగస్వామి ..

పామిడి: పట్టణంలో డబ్బేదార్ ఫిర్కా, రంగసుబే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి ఆషాఢ మాస బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా స్థానిక పెద్ద, చిన్న వితోబ దేవాలయాల్లో రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దిండి భజనల నడుమ రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి నగర ప్రదర్శన గావించారు. అనంతరం ఆలయంలో స్వపన తిరుమంజనం నిర్వహించారు. మంత్రపుష్ప మంగళహారతి అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలు అందించారు.

తాడిపత్రి అర్బన్: తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని మెయిన్ బజార్‌లోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రుక్మిణీ పాండురంగస్వామి మూల విరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వీధుల్లో స్వామి నగరకీర్తన నిర్వహించారు.

క్విజ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న జేసీ కేతన్‌గార్గ్



రాష్ట్రస్థాయి క్విజ్‌కు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

బుక్కరాయసముద్రం: భారతీయ రిజర్వ్ బ్యాంక్, ఏపీ సమీకృత అభివృద్ధి విభాగం వారు నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్‌లో సిద్దరాంపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ గురువారం తెలిపారు. పాఠశాలకు చెందిన భావన, లిఖిత మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. జిల్లా సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన క్విజ్‌లో తృతీయ బహుమతి సాధించి జేసీ కేతన్‌గార్గ్ నుంచి బహుమతి అందుకున్నారన్నారు.

రాష్ట్ర స్థాయి క్విజ్‌కు ఎంపిక..

గుత్తి: పట్టణంలోని ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్) లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పూర్ణ తేజిత, షీమాజైది ఆర్‌బీఐ ఆధ్వర్యంలో అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించారు. నిర్వాహకులు వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఉషా, ఉపాధ్యాయులు, అభినందించారు.

కంపచెట్ల తొలగింపు

పామిడి: మండలంలోని జీ కొట్టాల గ్రామంలో గురువారం సర్పంచ్ పెరమసాని లక్ష్మమ్మ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లను తొలగింపజేశారు. రోడ్డుకు పెరిగిన కంపచెట్ల వల్ల పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ కంపచెట్లను తొలగింపజేశారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: బక్రీద్ సందర్భంగా గురువారం రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మూడు ఈద్గా మైదానాల వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించింది. సుమారు 290 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారికి ప్రశంసాపత్రాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌డ్రాప్ వ్యవస్థాపకుడు రహిమాన్, గోపరాజు శ్రీనివాసరావు, మహేంద్రరెడ్డి, అధ్యక్షుడు గులాం మహమ్మద్, ఉపాధ్యక్షుడు చింతా దివాకర్, కార్యదర్శి షఫీ, మనోహర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి

గుంతకల్లుటౌన్: ఎరుకుల సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఏకలవ్య జయంతి వేడుకలను నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లోని ఆ సంఘం కార్యాలయంలో ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎరుకుల సంఘం పట్టణ అధ్యక్షుడు జి.ప్రభాకర్ మాట్లాడుతూ ఏకలవ్యుని దీక్ష, పట్టుదలను ఆదర్శంగా తీసుకుని కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. నాయకులు నాగరాజు, వరప్రసాద్, వివేకానంద, నాగేంద్ర, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభలు

పుట్లూరు: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై మూడు రోజులుగా తనిఖీలు నిర్వహించిన సామాజిక తనిఖీ బృందం సభ్యులు గురువారం గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని తక్కళ్లపల్లి, పుట్లూరు, కడవకల్లు, బాలాపురం, మడుగుపల్లి, దోశలేడు గ్రామాల్లో ప్రజల సమక్షంలో తనిఖీలలో వెల్లడైన వివరాలను తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా చెక్కుల అందజేత



బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 7వ వార్డుకు చెందిన కురుబ బొజ్జమ్మ, రాజగోపాల్ ఇటీవల జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా ఆయా కుటుంబాలకు (ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున) మంజూరైన రూ.10 లక్షల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అందజేశారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీ ఆర్.మోహన్, కౌన్సిలర్ కె.లింగన్న, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, నాయకుడు సాంబా, వార్డు కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బీకేఎస్ విద్యార్థిని



ప్రతిభ కనబరిచిన విద్యార్థినితో హెచ్‌ఎం వసుంధర

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి, లలితమ్మ పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న కీర్తన అనంతపురం జిల్లా జట్టు తరపున ఏలూరు జిల్లా నూజివీడులో జరిగే అంతర్ జిల్లాల అండర్‌-18 జూనియర్ బాస్కెట్ బాల్ టోర్నీలో పాల్గొంటుందన్నారు. విద్యార్థినిని హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



షికారీ కాలనీలో నిల్వ ఉన్న మురుగునీరును పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: 'షికారీ కాలనీలో ఇళ్ల ముందు మురుగు నిల్వ ఉన్నా ఎందుకు శుభ్రం చేయించడం లేదు, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక చూపాల్సిన బాధ్యత మీపై లేదా' అంటూ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శానిటరీ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతమైన షికారీ కాలనీలో నెలకొన్న అపరిశుభ్రతపై కౌన్సిలర్ సుధాకర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్ గురువారం షికారీ కాలనీని పరిశీలించారు. అధ్వాన్నంగా ఉన్న శానిటేషన్‌పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌ఛార్జ్ వార్డు శానిటేషన్ సెక్రెటరీ హర్షపై కమిషనర్ మండిపడ్డారు. సుమారు గంటన్నర పాటు కాలనీలోనే ఉండి మురుగునీటిని శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ వేయించారు. కాలనీకి డ్రైనేజీ మంజూరైనా ఇప్పటివరకు పనులు ఎందుకు ప్రారంభించలేదని ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్ చేత నాలుగైదు రోజుల్లో పనులు షురూ చేయించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏఈ శ్రీకాంత్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ మురళీ ఉన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు ధ్రువపత్రాలు



పి.జలాలపురంలో సర్వే నిర్వహిస్తున్న ఎంపీపీ యోగేశ్వరి, వలంటీర్లు

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన వారందరికీ 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందిస్తామని ఎంపీపీ యోగేశ్వరి అన్నారు. గురువారం పి.జలాలపురం గ్రామంలో వలంటీర్లతో కలిసి ఎంపీపీ యోగేశ్వరి, జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశాన్ని వివరిస్తూ వారికి అవసరమైన ధ్రువ పత్రాల గురించి తెలుసుకొని నమోదు చేయించారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం నేరవేర్చారని, పేదలకు సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ ద్వారా అదుకుంటున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల, మత, పార్టీ భేదం లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సచివాలయ కనీ్వనర్ శ్రీకాంత్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టిన ఘనత బాబుదే



విలేకరులతో మాట్లాడుతున్న ఎగ్గుల శ్రీనివాసులు

గుంతకల్లు: రాష్ట్రంలోని మాల మాదిగల పట్ల చిచ్చుపెట్టిన ఘనత టీడీపీ అధినేత చంద్రబాబుకు దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం ఆయన గుంతకల్లులో విలేకరులతో మాట్లాడారు. మాల, మాదిగలను విడదీసి గతంలో గద్దెను ఎక్కిన ఘనత బాబుదేనన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండంతో మాల మాదిగల ప్రస్తావన తీసుకొస్తున్నారని విమర్శించారు. బాబు పరిపాలనలో ఏ ఒక్క మాలమాదిగలు బాగుపడలేదన్నారు. టీడీపీ మంత్రుల చేత మహిళలను జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లిన ఘటన మార్చిపోగలమా అని ప్రశ్నించాడు. ఇక నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో ఎస్సీలు పీకింది లేదు పొడిచింది లేదంటూ మాట్లాడం ఎంత వరకు సమజసమన్నారు. దళితులు బాబు చెప్పే మయామాటాలు వినే పరిస్థితిలో లేరని, మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి వైపు ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. వాస్తవాలను అవాస్తవాలుగా చిత్రీకరిస్తూ చంద్రబాబుకు సహకరిస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి అధినేతలు రామెజీరావు, రాధాకృష్ణ ఇక మీదట ఎస్సీ, ఎస్టీల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సాయిపోగుల వీరేష్‌బాబు, ఎగ్గుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు భూమిపూజ



పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: ఊబిచెర్లలోని జగనన్న లేఔట్‌లో నూతన గృహ నిర్మాణాలకు గురువారం ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాస్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సొంతిల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలతో పాటుగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో జగనన్న ఊళ్లనే నిర్మిస్తున్నారన్నారు. సర్పంచ్ చిదంబరి, నాయకులు లక్ష్మీనారాయణ, నారాయణ స్వామి, గురుప్రసాద్ యాదవ్, ప్రవీణ్, కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

తాడిపత్రి: గన్నెవారిపల్లి కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఉమ్మడి గురుప్రసాద్ తన కుమార్తె అశ్విత పుట్టిన రోజును పురస్కరించుకుని ఉమ్మడి గురుప్రసాద్ ట్రస్ట్ ద్వారా కాలనీకి చెందిన సంధ్య అనే మహిళకు రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. కౌన్సిలర్ రంగనాథరెడ్డి, నాయకులు కురువ రామశేఖర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

తాడిపత్రి అర్బన్: స్థానిక శివాలయం వీధిలోని సాయిబాబా ఆలయంలో సోమవారం నుంచి జూలై 3 వరకు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు రాఘవ గురువారం తెలిపారు. తొలిరోజు మహాగణపతి, నవగ్రహ, రుద్ర చండీ , శ్రీదత్త, సాయి హోమం నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాత్రి పట్టన వీధుల్లో సాయిబాబా గ్రామోత్సవం ఉంటుందన్నారు. 2న 108 కలశాలు కాశీ, రామేశ్వరం మొదలగు పుణ్యనదీ తీర్థములతో 108 మంది దంపతులచే మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, సాయిబాబా మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, సాయంత్రం విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహిస్తామన్నారు.

4న టెంకాయల విక్రయ వేలం

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయ ఆవరణలో ఈ ఏడాది జూలై 5 నుంచి టెంకాయలు విక్రయించుకునేందుకు జూలై 4న వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ దేవదాసు గురువారం ప్రకటనలో తెలిపారు. రూ.5వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

నేటిలోపు ఈ-కేవైసీ చేయించుకోండి

గార్లదిన్నె: పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించుకోని రైతులు శనివారంలోపు చేయించుకోవాలని ఏఓ సోమశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఏఓ మాట్లాడుతూ ఈ కేవైసీ చేయించుకొని రైతుల వివరాలు ఆయా గ్రామ సచివాలయాల్లో నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. ఖరీఫ్‌లో ప్రతి రైతు చిరుధాన్యాలను సాగు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు.

3న బుగ్గ రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

తాడిపత్రి అర్బన్: ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందనకభంగా స్థానిక శ్రీబుగ్గ రామలింగేశ్వరునికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ పీవీఎస్ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు అమ్మవారి పంచలోహ విగ్రహానికి పంచామృతాభిషేకం, 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, 7.30కు మహన్యాస పారాయణం, 8.30కు రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు అమ్మవారికి సహస్ర నామ కుంకుమార్చన, 5.30లకు స్వామికి ప్రదోష పూజా దశవిధ హారతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం బైక్ అదుపు తప్పి కింపడి ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. గుత్తి మునిసిపాలిటీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించే కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తొండపాడు బొలికొండ రంగనాథ స్వామిని దర్శించుకునేందుకు వెళ్లాడు. గుత్తికి వస్తుండగా కొత్తపేట శివారులో వారు ప్రయాణిస్తున్న బైక్ టైర్ పంచర్ అయి అదుపు తప్పి కిందపడ్డారు. ప్రమాదంలో కృష్ణారెడ్డికి తీవ్ర గాయాలు కాగా కుమారుడు భువనేశ్వరరెడ్డి, కుమార్తె మానసరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



బోల్తా పడిన వాహనం

గుత్తి: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డుపై జగనన్న కాలనీ వద్ద గురువారం వాహనం బోల్తాపడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. పట్టణానికి చెందిన సుదర్శన్, వినోద్ బొలెరో వాహనంలో గరండాలు, బండలు వేసుకుని పట్టణంలో నుంచి జగనన్న కాలనీకి బయలుదేరారు. కాలనీ వద్ద మిట్ట ఎక్కలేక వాహనం బోల్తాపడింది. అందులో ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గార్లదిన్నె: మండల కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది వివరాల మేరకు.. గార్లదిన్నెకు చెందిన నాగేంద్ర, శేఖర్ బైక్‌పై వెళ్తుండగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి సమీపంలో ఆవు అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పబ్లిక్ నోటీసు

మా కక్షీదార్లు గుత్తి పట్టణము వాస్తవ్యులు (1) ఎం.రంగనాథ్ S/o కృష్ణమూర్తి. (2) బి.నిరంజన బాబు S/o చౌడప్ప, (3) పి.లక్ష్మీనారాయణ S/o వెంకటేశ్వర్లు, (4) కె.రఘునాథ్ S/o రంగయ్యశెట్టి (5) వై.సత్యనారాయణ S/o గురుస్వామి లను వారి తరుపున యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా, మా కక్షీదార్లు గుత్తి గ్రామము సర్వే నెంబరు 617లోని ఎ.1-95 సెంట్లు ఆస్తిని ఆసాటి ఆస్తి హక్కు దార్లయిన పెద్దవడుగూరు మండలము, గుత్తి అనంతపురము గ్రామస్తులు (1) పామిరెడ్డి నీలకంటరెడ్డి కుమారుడు భాస్కర్ రెడ్డి (2) పామిరెడ్డి వెంకటరెడ్డి కుమారుడు విశ్వనాథ్‌రెడ్డి అను వార్ల నుండి 11-05-2010వ తేదీన కొనుగోలు చేసి రిజిస్టరు పొంది వారినుండి స్వాధీనము పొంది యుండిరి. సదరి రిజిస్టరును విస్మరించి పామిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి కుమారుడు విష్ణువర్ధనరెడ్డి అదే ఆస్తికి రెవెన్యూ పట్టా పొంది యుండిరి. విషయము తెలుసుకున్న మా కక్షీదార్లు గుంతకల్లు రెవెన్యూ డివిజను అధికారి (R.D.O) వద్ద దాఖలు చేసిన ఫిర్యాదు కారణముగా పామిరెడ్డి విష్ణువర్ధన రెడ్డి పేరును రెవెన్యూ రికార్డుల నుండి మరియు Online web portal నుండి తొలగించి సదరి ఆస్తికి సరైన హక్కుదార్లను కోర్టు నుండి నిర్ధారణ పొందవలసినదిగా ఆదేశించినారు. అందు నిమిత్తము మా కక్షీదార్లు గుత్తి జూనియరు సివిలు జడ్జి వారి కోర్టులో O.S. 55/2023 అనబడు దావా దాఖలు చేసియున్నారు. పై పరిణామముల దృష్ట్యా ఎవరైననూ పైన కనబరచిన ఆస్తికి సంబంధించి మా కక్షీదార్లను విస్మరించి పైన కనబరచిన వ్యక్తులతో లావాదేవీలు జరిపిన యెడల కలగబోవు నష్టములకు మా కక్షీదార్లు యెంత మాత్రము బాధ్యత వహించబోరు.

సం/- జి.శ్రీకాంత్‌రెడ్డి, వకీలు, గుత్తి